
# చూపున్న పాట

కె. యన్. వై. పతంజలి



పూలంతీగె కాళ్ళకు చుట్టుకుని కారెను బోతు ఆగిపోయినట్టు ఆ వేణునాదం విని విశ్వనాథం ఆగిపోయాడు.

జనప్రవాహం పైనుంచి వంతెన. దాని మీద రైలుపట్టాలు.

వంతెన గోడ కానుకుని ఒక గుడ్డిమనిషి.

అతని బండపెదవుల నానుకొని ఎప్పుడూ ఒక మురళి.

ఆ మురళి రంధ్రాల నుంచి కాటుక పొగలై. సర్పాలై జరజర పాకివచ్చే పాటలు.

విశ్వనాథానికి మోటారు సైకిలు చప్పుడులో ఆపాటలు ఎప్పుడూ వినిపించవు.

వంతెన పైనుంచి వెళ్ళిపోయే రైలూ ఆలకించదు.

వంతెన కిందనుంచి ప్రవహించే జనమూ ఆలకించదు

మోటారు సైకిల్ మీద వెళ్ళిపోయే విశ్వనాధం ఎన్నడూ వినలేదు.

గుడ్డివాడి పాటలు గరికపూలై ఆ రోడ్డు నిండా గుట్టలు గుట్టలైతే విశ్వనాధం వాటిని తొక్కుకుంటూ వెళ్ళిపోతాడు.

గుడ్డివాడి పాటలు సీతాకోకచిలుకలై మబ్బుల్లాగ వీధినంతా ఆవరిస్తే విశ్వనాథం వాటిని చీల్చుకొని వెళ్ళిపోతాడు.

ఒకరోజు వంతెనదగ్గర అతని మోటారు సైకిల్ ఆగిపోయింది.

చీదరించుకుంటూ ఆ సైకిలుకు స్టాండు వేసి నిల్చున్నాడు.

పైనుంచి చంకాలంగా చప్పుడు చేస్తూ రైలింజన్ ఒకటి వెళ్ళిపోయింది.

దూరంగా వున్న ఏదో చెట్టు మీద ఒక కోకిల "న్యూసెన్సు"గా కూస్తున్నది. దానికి తోడు.

-ఈగుడ్డిగాడిదకొడుకొకడు.... ఫ్లూటు అంటారు గావోసు— ఖాకీపేంటు జేబులోంచి అతను ఖాకీ సిగరెట్టు తీసి వెలిగించి ఖాకీ పొగ వదిలాడు.

గుడ్డి మనిషి వేణువులోంచి ఒక పాము వచ్చి విశ్వనాథాన్ని చటుక్కున కుట్టింది.

ఉలిక్కిపడ్డాడతను.

-గుడ్డి లంజికొడుకు వాయిస్తున్నది ఏ పాట!

గద్దరుగాడి పాట!

అమ్మనాకొడక

నక్సలైటు నాకొడక-

దోపిడీచెయ్యటం కాడ్నుంచి అడుక్కునే వన్లో కూడా మీరే చొచ్చుకుపోయేరన్న మాట.

విశ్వనాథం చరచర నడుస్తూ ముసలాడి దగ్గరకు వెళ్ళాడు.

"ఏంరోయ్... గుడ్డి నా కొడకా...." అని పిలిచాడు.

చేయి ముందుకు చాస్తూ—

"ఎవరది.... ఎవరది...." అని పిరికిగా, భయంగా అన్నాడు.

"నీ అమ్మా మొగుడిన్ని.... గుడ్డి నా కొడకా.... ఏం పాటలు పాడుతున్నావురా? కాళ్లేకులు విరిచీగలన్ను...."

గుడ్డి మనిషి నిజానికి పుట్టుగుడ్డి. వాడికి వెలుతురంటే తెలీదు. మనుషుల ఆకారం తెలీదు. జంతువుల ఆకారం తెలీదు. కాని కుక్కొస్తే, పోలీసొస్తే అతనికి ఎలాగోగాని తెలిసిపోతుంది. వచ్చినవాడు పోలీసని అతనికి తెలిసిపోయింది.


"పోలీసా!" అని అతను భయంగా అడిగాడు.

విశ్వనాథానికి అనుమానం గట్టిపడిపోయింది.

"నన్ను చూడగానే పోల్చేసేవు.... అంటే నువ్వు నిజంగా గుడ్డోడివి కాదన్న మాట...." అన్నాడతను.

"చూడగానే కాదు బాబు. నాకు చూపే లేదు. చప్పుడుబట్టి పోల్చేను...." అన్నాడు గుడ్డిమనిషి దండం పెడుతూ.

దండధాయిలు దండాలకి కొంత తగ్గుతారు. విశ్వనాథం తగ్గి— "నువ్వు అడుక్కుతినే



నాకొడుకువా కాదా!"అని అడిగాడు.

"అడుక్కోను తండ్రీ. నేను ఈ మురళి వాయిస్తాను.... దయగలతండ్రులు పావలా బేడా ఇస్తారు...."

"వాయించుగానీ..చక్కా దేవుడి పాటలుంటాయి అయి వాయించుకో.. ఇలాంటి నక్సలైటు పాటలుగానీ పాడేవంటే చావదొబ్బుతాను." అన్నాడు విశ్వనాథం గుడ్డి మనిషి కంటిముందు చూపుడువేలు ఆడిస్తూ.

గుడ్డిమనిషి మాట్లాడలేదు.

విశ్వనాథం అక్కడ్నుంచి ఒచ్చేసేడు.

మరో నాలుగురోజులు పోయినతర్వాత ఆ దోవన వస్తుంటే ఆ గుడ్డిమనిషి మురళి వాయిస్తూండటం కనిపించింది.

-'మన శిశువు ఏటి వాయిస్తున్నాడో సూద్దారి.' అనుకుని అతను మోటార్ సైకిల్ ఆపు చేశాడు.

"దండూ దండూకు నేను ఎర్ర జండ నౌదు

భారతీ గిరియాల

కూలినా లన్నాలు

నా కూలీనాలన్నాలు

దండుఖ్లేరంగో

దండూడు దండూ నేను ఎర్ర జండ నౌదో....

శతగాత్రంతో మురళి పాడుతోంది.

విశ్వనాథం పడగ విప్పాడు.

సైకిల్ స్టాండు వేసి, గుడ్డివాడి రెక్కపట్టుకొని అధాట్టున పైకి లేపేడు. వళ్ళంతా తూట్లు పడిన వెదురు ముక్క కింద మట్టిలో పడిపోయింది.

"పదరా స్టేషన్కి.... నీ గుడ్డికళ్ళు పీకేయకపోతే నేను పోలీసునై పుట్టలేదు.." అన్నాడు విశ్వనాథం.

గుడ్డికళ్ళనో, అందులో నుంచి చుంచెలుకల్లాగ తొంగిచూస్తున్న భయాలనో దాచడానికి అతని రెప్పలు రెక్కలు రాల్చేయి.

బండ పెదాలు భయంగా రోకలిబండల్లాగ ముడుచుకున్నాయి.

"ఎందుకండి బాబు ..." అన్నాడు గుడ్డి మనిషి.

"మొన్న నీకేం చెప్పేన్రా!"

గుడ్డివాడు పెదాలతో గాలి మాత్రం

గుడ్డి మనిషి అది వినలేదు.

"నీ పాటా పాడుతున్నమూ

నీ ఆటా ఆడుతున్నమూ...."అంటోంది మురళి.

వంగి అతని చేతిలోని మురళి లాక్కుందామనుకుని,—మనకి దేవుడిచ్చిన కాళ్ళుండగా చేతులెందుకు పాడుచేసుకోవాలి— అనుకుని ఎర్రబూటుతో ఆ మురళిని కదిపేడు.

ఆ బూటు మడమ గుడ్డిమనిషి గడ్డానికి తగిలింది.

గుడ్డికళ్ళ గుహల నుంచి చీకటి చిమ్ముకొచ్చింది.

అతను భయంగా కంగారుగా లేచి నిల్చున్నాడు.

పూడగలడు. అది మురళి గొంతులో మాత్రం శబ్దమౌతుంది. శక్తిమంత మౌతుంది.

అందువల్ల అతనేమీ అనలేదు.

"దేవుడిపాటలు పాడమన్నానా లేదా!" అని కోపంగా అడిగాడు విశ్వనాథం.

గుడ్డిమనిషి వెర్రినవ్వు నవ్వాడు.

విశ్వనాథం బుస్సుమన్నాడు.

"నేను సీరియస్గా అడుగుతుంటే నీకు నవ్వొస్తన్నాదిరా లంజకొడకా" అన్నాడతను-

"పావల్డబ్బులిచ్చి మీరేపాట పాడమంటే ఆపాట పాడతానండి" అన్నాడు గుడ్డిమనిషి చాలా మృదువుగా విశ్వనాథం చేయి విడిపించుకుంటూ-

# ప్రజాస్వామ్యం



నా దేశపు ప్రజాస్వామ్యం
ఎలాంటి దంటె
ఏదైనా రాష్ట్రంలో అల్లర్లు జరిగితే
పరిష్కారాలు మానేసి మా మంత్రులు
చేసే పనులు
కల్లోలిత ప్రాంతంగా ప్రకటన
దివారాత్రాలు కర్ఫ్యూ విధింపు
వీధుల్లో సైనికుల కవాతులు
గాలిలో తుపాకుల కాల్పులు
రోడ్ల మీద శవాల గుట్టలు!

—మోదు రాజేశ్వరరావు
(కుసుమ)

"మరైతే నువు వాయిస్తున్న పాటకి డబ్బులు ఎవరిచ్చేరు....మావో సేటుంగ్ ఇచ్చేడా? చారుమజుందారిచ్చేడా... నీఅమ్మా మొగుడిచ్చాడా? చెప్పు లంజాకొడకా? ఏ లంజాకొడుకు నీకు డబ్బులిచ్చి ఈచెండాలపు పాటలు పాడిస్తున్నాడు...." అనిచాలా కఠినంగా అడిగాడు.

"ఈ పాటలు మంచియి గాదా తండ్రీ?" అని ఆ గుడ్డి మనిషి నెమ్మదిగా అడిగాడు.

"కాదమ్మా.. నువుమంచిపాటలు పాడితే నేనెందుకు తిడతానమ్మా. నువ్వు శ్రీవెంకటేశ ఈశా. పాట వాయించు. గవర్నమెంటుతో మాటాడి నీకు భత్యం ఇప్పిస్తాను. మా పోలీస్‌స్టేషన్ ముందుకూచ్చుని రోజూ నువు దేవుడి పాటలు పాడు. నీకు ఎన్ని డబ్బులొస్తాయో చూసుకో. ఆ డబ్బులు పెట్టి నువ్వు చక్కా రిక్షా కొనుక్కోని ఊర్లోకి ఎక్కడ బడితే అక్కడికి వెళ్ళి అడుక్కోవచ్చు. నీ బతుక్కి ఢోకా వుండదు. నీ మంచి కోరే నేనిదంతా చెబుతున్నాను.... నువ్వు భలేగా వాయిస్తావు మురళి. అసలు మురళి దేవుడిదిగదా. శ్రీకృష్ణుడిది. నువు దాన్ని తీసుకెళ్ళి గద్దర్ గాడి చేతికిస్తే ఎలాగ?" అన్నాడు విశ్వనాథం.

"గద్దర్ ఎవరండీ?" అని గుడ్డిమనిషి అడిగాడు.

"వాడొకడున్నాడ్లే.... తెలుసుకోవడం నీకు మంచిది కాదు....అసలు నీకాపాటలెలా గొచ్చురా?" అనడిగాడు విశ్వనాథం.

"మా మురికి పేటలో అలకించేనండి.."

విశ్వనాథం తలూపాడు-"అదీ కధ.... అందికే మురికి పేటలు లేకుండా చేసేయాలి. మురికంటే పెంటకదా? పేడగదా? పేడంటే పత్తుపుగదా. అక్కడ ఈ పాటలు నాటేస్తాయి. అసలు అందరూ మేడల్లో వుంటే ఈ దేంజరుండదు...."

నల్లని బండ పెదాలు సాగేయి. వాటి వెనుక తెల్లని పల్వరుస మెరిసింది.

"అవునుబాబూ...."అన్నాడు గుడ్డివాడు.

టివ్వి టివ్వి టివ్వి టివ్వి ట్వీట్
టివ్వి టివ్వి టివ్వి ట్వీట్

అవి అరుచుకుంటూ ఒక తీతిక ఎగిరిపోయింది.

"విన్నావా?" అన్నాడు విశ్వనాథం.

"అవునండి. తీతిక...." అన్నాడు గుడ్డిమనిషి కూర్చొంటూ.

"అదే.. అన్నరు. నువు గద్దరుగాడంటే ఎవడని అడిగేవుగదా. గద్దర్ అంటే తీతిక..." అన్నాడు విశ్వనాథం.

"తీతిక కూస్తే ఎవరికో కీడు మూడిందంటారండి." అన్నాడు గుడ్డి మనిషి వేణువు కోసం తడుముతూ.

"అవును మరి అపశకునం...."

"అంటేఏ లంజకొడుకో సస్తాడన్నమాటే గదండి" అన్నాడు గుడ్డి మనిషి దొరికిన వేణువును కుడి చేత్తో అందుకుని ఇసుక దులుపుతూ.

"అవునుగాని నువు రఘురామయ్యగారి 'రామ నీల మేఘశ్యామా' వాయించవా...."

అని అడిగాడు విశ్వనాథం.

"నాకు రాదండి"

"నేను నేర్పుతాను"

"నేరిస్తే రాదండి పాట... మనం ఇనీనరికి పాట మనల్ని తగులుకోవాలండి.... అదండి పాటంటే.. ఆ తీతిక పాట తగులుకుంటాదండి ..." అన్నాడు మొప్పు పెదాలకి పేద వేణువు చేర్చుతూ.

"పోనీ నీకొచ్చిన పాట పాడు దేవుడి పాట." అన్నాడు విశ్వనాథం.

గుడ్డి మనిషి ఊపిరి పీల్చుకుని ఊదటం ప్రారంభించాడు.

"నల్రెంక సెట్టు కింద నరుడో
భాస్కరుడో
నువు కన్నెర్ర చేస్తివయ్య నరుడో
భాస్కరుడో
బర్రెంక సెట్టుకింద నరుడో భాస్కరుడా
నువు బందూకు బట్టివయ్య నరుడో
భాస్కరుడా."

అని ప్రారంభించేడతను.

పాట అగరొత్తి పొగలాగ సాగుతోంది.

పాట మందార కొనలాగ ఊగుతోంది.

పాట రాతి గోడలోని మర్రి మొలకలాగ పెరుగుతోంది.

సగం అయ్యేసరికి విశ్వనాథానికి తెలిసిపోయింది.

గభాలున మురళి లాక్కున్నాడు.

"నిజంచెప్పు..నువునక్సలైటువుకాదూ?"

"నక్సలైటంటే ఏటి బాబూ?"

"నువు కమ్యూనిస్టువు గాదూ?"

"కమ్యూనిస్టంటే ఏటిబాబూ?"

"ఏమీ కాకుంటే ఈ పాటలెందుకు పాడుతున్నావు...."

"అవంటే నాకిష్టం కాబట్టి...."

"ఎందుకని?"

"తెలీదు"

"నీ కిష్టమైతే అయిందిగానీ నాకు ఇష్టం లేదు. నువు మరోసారి పాడావో నరికేస్తాను. పెదాలు చీల్చేస్తాను జాగ్రత్త.... నా కొడకల్లారా....నరికేస్తానుజాగ్రత్త...." అని కేకలేసి చేతిలోని మురళి నేల మీద వదేసి బూటుకాలితో చెడామడా తొక్కాడు.

బూటుకింద నలిగిన వేణువు చిట్లింది. దాని గాలి రంధ్రాల నుంచి ఇంత నెత్తురు కారింది.

కళ్ళు ఇంతలు చేసుకుని చూసేడు విశ్వనాథం.

చిట్లిన వేణువు నుంచి రక్తం స్రవిస్తోంది....ఆగకుండా....

అది ఇసుకలో ఇంకకుండా ధారకట్టింది.

ధార ఒక రక్తపొడ పాము లాగ సాగింది.

విశ్వనాథం భయంగా వెనక్కి అడుగులు వేశాడు.

ఆ ధార అతనికేసి సాగింది.

అది అంతకంతకు పెద్దదయింది.

అతనికి దగ్గరయింది.

విశ్వనాథానికి భయమయింది.

గభాలున మోటారు సైకిల్ స్టార్టు చేశాడు.

స్టార్టుచేసిన సైకిల్ గుర్రంలాగ ఒక దూకు దూకింది.

పగపట్టిన పాములాగ ఆ నెత్తుటి ధార అతని వెంటపడింది.

అది సన్నగా మొదలై, బలపడి, వెడల్పయి, పెనువేగంతో పరిగెడుతోంది.

ముందు విశ్వనాథం మోటారు సైకిల్
వెనకాల ఆ నెత్తుటి ప్రవాహం ...

పాములాగ అది అతన్ని వెంటాడుతోంది

చిట్లిన వేణువు అక్కడే వుండి నెత్తురు స్రవిస్తోంది.

నిరంతరం
అవిశ్రాంతంగా!

(మార్క్సిజ్ మీద ప్రేమతో)